

కార్పొరేటర్‌తో కలిసి ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సకల సౌకర్యాలతో పార్కుల అభివృద్ధి : సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని అన్ని పార్కుల్లో ఆహ్లాద వాతావరణమే కాకుండా శారీరక, మానసిక దృఢత్వానికి వాకింగ్, వ్యాయామాలు, యోగా వంటి సౌకర్యాలతో అభివృద్ధి పరుస్తున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ సౌత్ ఎండ్‌పార్కు కాలనీలోని పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పార్కుల్లో కల్పించే సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, బీజేపీ నాయకులు సిద్ధాల ఐలయ్య, పంగ శ్యామ్‌కుమార్, సంజీవరెడ్డి, పద్మారెడ్డి, గీతారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకులు, కాలనీసభ్యులు పాల్గొన్నారు.



డీఎల్ఆర్ఎల్ కాలనీలో మొక్కలు నాటుతున్న చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట్ కాలనీల్లో చల్లా పర్యటన

సరూర్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని డీఎల్ఆర్ఎల్‌కాలనీ, ప్రశాంతిహిల్స్, న్యూనందిహిల్స్, విజ్ఞాన్‌పురి తదితర కాలనీల్లో శనివా రం టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి పర్యటించారు. ఇటీవల ఆయా కాలనీల ప్రతినిధులు స్థానిక సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేసిన నేపథ్యంలో శనివారం ఆయన కాలనీల్లో పర్యటించి సదరు సమస్యలను పరిశీలించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్దా పవన్‌కుమార్, కీసరి హరినాథ్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, మురళిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం

వనస్థలిపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని ప్రసిద్ధ గణేష్ ఆలయంలో ఈనెల 15 నుంచి 27 వరకు సామూహిక లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణంను ప్రతి రోజు 9సార్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.ధర్మారావుగుప్తా, ప్రధాన కార్యదర్శి పి.వి.కే సోమయాజులు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో సోమయాజులు మాట్లాడుతూ ఈనెల 14న సంకటహర చవితి సందర్భంగా లక్ష్మీగణపతి అభిషేకం, అర్చన, గణపతి హోమం, అదేవిధంగా ఈనెల 23న ఉమారామలింగేశ్వరస్వామి వార్లకు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు, చిత్రంలో ఇంద్రసేనారెడ్డి, రామచంద్రరావు తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎల్బీనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఅవుట్ కాలనీపార్కులో శనివారం కాలనీకి చెందిన ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ జిల్లా 301, చార్టర్ నంబర్ 1465 వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ముత్తూట్ ఫైనాన్స్ వారి సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు పలు వైద్యపరీక్షలను స్థానికులతో పాటు పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆలయ ప్రతినిధులు

పోచమ్మ ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగను పురస్కరించుకొని ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మఆలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం ఆలయ ప్రతినిధుల బృందం అభివృద్ధి పనులు ప్రారంభించారు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, స్థానిక కార్పొరేటర్ సౌజన్యంతో ప్రభుత్వం నుంచి ఆలయ అభివృద్ధికి రెండున్నర లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆలయం లోపల గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. పాత ఫ్లోరింగ్ దెబ్బతినడంతో ఆలయానికి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీన్ని పూర్తిగా తొలగించి కొత్త ఫ్లోరింగ్ నిర్మిస్తున్నారు. ఈనెల 20న ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి రంగులు, ఇతర మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పి.శంకర్‌ముదిరాజ్, సురేష్‌కుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, చౌకి రవికుమార్, పి.శ్రీధర్, టిన్నుసింగ్, బాబాగౌడ్, ఆలయ పూజారి శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.



కొండల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ మాజీ చైర్మన్ రఘుమారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి

కర్మన్‌ఘాట్ ఆలయాన్ని దర్శించుకున్న సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి

చంపాపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయాన్ని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనం, స్వామి వారి ఫొటో, ప్రసాదం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లావణ్య, చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు దిండ ప్రవీణ్‌గౌడ్, కిరణ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి, కవిత, సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డిని ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి సన్మానించారు.

విశ్వనగరంలో ఎక్కడ చూసినా సమస్యలే

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హయత్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): విశ్వనగరంలో ఎక్కడ చూసినా సమస్యలే తాండవిస్తున్నాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి డివిజన్‌లోని కుమ్మరికుంట- సాహెబ్‌నగర్ మట్టిరోడ్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదు.. శివారులో కొత్తగా వెలుస్తున్న కాలనీల పరిస్థితులను చూడండి అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శివారు ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైటెక్ సిటీని చూసి గొప్పలు చెప్పుకోవడం మాని బస్తీల్లో, కాలనీల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించండని అన్నారు. హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోల్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను చూస్తుంటే గుండె తరుముకుపోతుందన్నారు. వర్షం కురిస్తే నేటికీ అనేక బస్తీలు, కాలనీలు నీట మునుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సామ రంగారెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, బండారు భాస్కర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకిటి బాల్‌రాజ్‌ముదిరాజ్, ఉగాది ఎల్లప్ప, గంగని శ్రీనివాస్ పాల్గొన్నారు.



హయత్‌నగర్ కుమ్మరికుంటలో పర్యటిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఏడాది కాలంలోనే ఎన్నడూ లేనంతగా అభివృద్ధి

మన్సూరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా ఏడాది పాలనలోనే అధికంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేసుకోవడం జరిగిందని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌తో కలిసి శనివారం ఎంపీ ఈటల డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. అనంతరం రాక్‌టౌన్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి అధ్యక్షతన కాలనీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద పార్లమెంటు నియోజకవర్గం మల్కాజిగిరి అని, ఇలాంటి పెద్ద నియోజకవర్గానికి పార్లమెంటు సభ్యుడిగా గెలిపించిన ప్రజల రుణం ఎప్పటికీ మరచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నాయికోటి పవన్ కుమార్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, ప్రముఖ గాయకుడు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రహదారి విస్తరణ దిశగా అడుగులు

- 75 చెట్లను తొలగించనున్న అటవీశాఖ అధికారులు

సరూర్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్-గాంధీనగర్ రహదారి విస్తరణకు అడ్డంకిగా మారిన విద్యుత్ స్తంభాల తరలింపునకుగాను మునిసిపల్ నిధుల నుంచి రూ.55లక్షలు మంజూరు చేయించామని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తెలిపారు. సదరు నిధులను రెండ్రోజుల్లో ట్రాన్స్‌కోకు చెల్లిస్తామని, ఆ వెంటనే ప్రస్తుతం ఉన్న స్తంభాలను రోడ్డు విస్తరణ చేయనున్న చోటుకు మారుస్తారని ఆమె అన్నారు. శనివారం మునిసిపల్, ట్రాన్స్‌కో, ఫారెస్టు తదితర విభాగాల అధికారులతో కలిసి ఆమె నాదర్‌గుల్ రోడ్డులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బస్టాండ్ నుంచి గ్రీన్ హోమ్స్ కాలనీ వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ గాంధీనగర్-నాదర్‌గుల్ రహదారి విస్తరణ కోసం రూ.9కోట్లు మంజూరయ్యాయ ని, అయితే స్తంభాల తొలగింపు కోసం మునిసిపల్ నిధులు కేటాయించడం లో గత పాలకవర్గం తాత్సారం చేయడంతో రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయని అన్నారు. ప్రధాన రహదారి అభివృద్ధిపై గత పాలకవర్గం ఎందుకోగానీ ప్రత్యేక దృష్టి పెట్టలేదని, ఇటీవల తాను అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రూ.55లక్షలు మంజూరు చేయించానని ఆమె పేర్కొన్నా రు. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా 75 చెట్లను అటవీశాఖ అధికారులు గుర్తించారని, త్వరలోనే వాటిని సైతం తొలగింపజేస్తామని ఆమె చెప్పారు. ఓ వైపు రోడ్డు విస్తరణ జరుగుతుండగానే మరోవైపు నుంచి రోడ్డు మధ్యలో సింగిల్ డివైడర్ నిర్మాణం సైతం చేపడతామని, దాంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని ఆమె పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సైతం ని ధులు సిద్ధంగా ఉన్నాయని, డివైడర్ నిర్మాణం పూర్తి కాగానే లైటింగ్ పను లు సైతం పూర్తి చేయిస్తామని చెప్పారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్క రూ రహదారి అభివృద్ధితో పాటు ఇతర అభివృద్ధి పనులకు సైతం సహకరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ వెంకన్న, భాగ్యనగర్ రైతు సొసైటీ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, కౌన్సిల్ బీఆర్ఎస్ మా జీ ఫ్లోర్ లీడర్ సూర్డగంటి అర్జున్, మాజీ కౌన్సిలర్లు యెల్మల మమతాసుదర్శన్‌రెడ్డి, అంకంగారి మంజులాకుమార్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పార్టీ నాయకులు, ట్రాన్స్‌కో, ఫారెస్ట్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్ రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తుర్కయంజాల్ మున్సిపాలిటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అగ్రగామి మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కమ్మగూడ, తుర్కయంజాల్, మన్నెగూడ, రాగన్నగూడలోని 7, 8, 10, 11, 12, 19, 20 వార్డులలో రూ.8కోట్ల46లక్షలతో సీసీ, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, రోడ్లకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు, రైతు భరోసా అందిస్తామన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మశివకుమార్, నాయకులు మర్రి మాధవిమహేందర్‌రెడ్డి, కుంట గోపాల్‌రెడ్డి, యాదగిరి, కొంతం వెంకట్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, రాజశేఖర్, సునీల్, పూజారి శంకరయ్యగౌడ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

ఫీజుల బకాయిలను విడుదల చేయాలి

- 15నుంచి పోస్ట్ కార్డుల ఉద్యమం : పీడీఎస్‌యూ

చాదర్‌ఘాట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ఈనెల 15వ తేదీ నుంచి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డుల ఉద్యమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ తెలిపారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో పీడీఎస్‌యూ హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజుల బకాయిల పట్ల ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుందని విమర్శించారు. ఈనెల 15నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పోస్టు కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని, విద్యార్థి లోకం తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రూ.8వేల కోట్ల పైచిలుకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నా ఇంతవరకు మంజూరు చేయకపోవడంతో విద్యార్థిలోకం తీవ్ర ఆగ్రహానికి గురవుతుందన్నారు. ఈనెల 15 నుంచి 17 వరకు రాష్ట్ర విద్యార్థులందరు పోస్ట్ కార్డుల ద్వారా విద్యారంగ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఉద్యమాన్ని విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.గణేష్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షుడు మందుల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి కె.వంశీ, నాయకులు శ్రీకాంత్, అరుణ్, కార్తీక్, నాని, వీరేష్, శివుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, సైదులు

రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత ట్రాఫిక్ నిబంధనలపై పలువురికి రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) అధికారులు శనివారం అవగాహన కల్పించారని ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలోని 13 ప్రాంతాల్లో 435 మంది సాధారణ ప్రజలకూ, డ్రైవర్లకు రహదారి భద్రత, నిబంధనల ప్రాధాన్యత తదితర అంశాలపై ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ సంతోష్ కుమార్ అవగాహన కల్పించారన్నారు. ఉప్పల్ నాచారం పరిధిలోని 8ప్రాంతాల్లో, ఉప్పల్‌లో 3, మౌలాలిలో రెండు ప్రాతాల్లో వారు నిబంధనలను పరిచయం చేశారని తెలిపారు. వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, ప్రజలకూ రోడ్డు భద్రతపైన దృష్టి పెట్టాలని ప్రమాదాల నివారణకు నిబంధనలు తప్పక పాటించాలని ఆయన వివరించారు.

78 మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సిలింగ్

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 39 మంది మద్యం ప్రియులకు, 39మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య కౌన్సిలింగ్ నిర్వహించారు. టీటీఐ సిబ్బంది రమేష్ కౌన్సిలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలు ప్రదర్శించారు.



ప్రమాదాల కారణాలను వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి


దొడ్డ నారాయణకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నల్గొండ జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ దొడ్డ నారాయణ మరణం పార్టీకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మృతి పట్ల వారు సంతాపం తెలుపుతూ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లోని పార్టీ కార్యాలయంలో నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియలకు వెళ్లారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, వట్టి నవనీత, దాసరి ప్రసాద్, సైదులు, పాండు, అశోక్, కావేరీ పాల్గొన్నారు.

గౌడ సంఘం సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌గౌడ్

సరూర్‌నగర్ : అఖిలభారత గౌడ సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా బడంగ్‌పేట్‌కు చెందిన జెల్ల శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ ఆయనకు శనివారం నియామక పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గౌడల సంక్షేమం కోసం రాష్ట్ర, జిల్లా గౌడ సంఘం చేసే కృషిని సోషల్ మీడియా వేదికగా గౌడన్నలకు తెలియజేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా మందుల వాహనం దగ్ధం



మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఫార్మా మందులను లోడ్ చేసుకుని వెళ్తున్న వాహనంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి దగ్ధమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనాయక్, ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం నుంచి పటాన్‌చెరు వైపు ఫార్మాకు సంబంధించిన మందులు, వస్తువులను అశోక్ లేలాండ్‌కు సంబంధించి దోస్త్ వ్యాన్(టీఎస్30టీ5827)లో నింపుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆ వ్యాన్ నుంచి నెమ్మదిగా నిప్పురవ్వలు వస్తుండడంతో సర్వీస్ సెంటర్‌కు రిపేరు చేయించుకునేందుకు బయల్దేరిన డ్రైవర్ సురేష్ ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపం వద్దకు రాగానే ఒక్కసారిగా ప్రమాదవశాత్తు ఆ వ్యాన్ నుంచి మంటలు పెద్ద ఎత్తున వచ్చాయి. కాగా నిమిషాల వ్యవధిలోనే ఆ వ్యాన్ పూర్తిగా దగ్ధమవ్వడంతో ఉప్పల్ నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకు న్న నాగోల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలం వద్దకు చేరుకుని అగ్నికి ఆహుతి అయిన వాహనా న్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపీలు ఆర్ కృష్ణయ్య, ఈటల

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

- ఏజెన్సీ వ్యవస్థ రద్దు చేయాలి
- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల

కవాడిగూడ: ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి.. దాని స్థానంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పలువురు రాజకీయ పార్టీ నేతలు, వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా తన గొంతు వినిపిస్తానన్నారు. ఈటల మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేయకపోతే ప్రభుత్వాలు స్తంభించిపోయే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరించా రు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో మార్పు రా వాలన్నారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికలలోపే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న కళాశాలల చైర్మన్ రంగినేని వెంకట్రావ్, ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి

ఎల్బీనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. శ్రీ హిందు కళాశాలలో 21వ స్నాతకోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కళాశాలల చైర్మన్ రంగినేని వెంకట్రావ్, ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో అభివృద్ధిని సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా గత సంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పట్టాలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మవం శ్రీనివాస్, డాక్టర్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అఖిల భారత గౌడ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా భాస్కర్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అఖిల భారత గౌడ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జిగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భీమగోని భాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ శనివారం భాస్కర్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. గౌడ సంఘం రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిగా జెల్లా శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడిగా ఎరుకల జంగయ్య, మండల ప్రధాన కార్యదర్శిగా సందిళ్ల శ్రీశైలంగౌడ్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గానికి చెందిన గీత కార్మికులతో పాటు యువతను విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ సామాజిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేషంగౌడ్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, శ్రీనివాస్‌గౌడ్, పద్మజాగౌడ్, రాములు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు యువకుల అరెస్ట్, రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

వనస్థలిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలకుంట జాంగీర్‌నగర్‌కు చెందిన మహ్మద్ అమీద్(22), వనస్థలిపురం హిల్‌కాలనీకి చెందిన షేక్ ఆజం ముజామిల్(19), వనస్థలిపురం సచివాలయనగర్‌కు చెందిన చిలుకూరి మనీష్(20), మరొక మైనర్ బాలుడుతో కలిసి ఈనెల 6న మధ్యాహ్నం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పాపిరెడ్డికాలనీకి చెందిన మన్నం సందీప్ ఇంట్లో దొంగతానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి శనివారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఉన్న 17 తులాల బంగారు ఆభరణాలు, రెండు బైక్‌లు, 3 సెల్‌ఫోన్లతో పాటు దొంగతనానికి ఉపయోగించిన యాక్టివ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ కేసును త్వరితగతిన ఛేదించిన వనస్థలిపురం పోలీసులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందనలు తెలిపి తగిన రివార్డు కోసం సిఫార్సు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786